
జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ కరీంనగర్
సోమవారం 7 ఏప్రిల్ 2025
www.ntnews.com
12

## విశ్వాసం గొప్పదనం

ఉపనిషత్ వాక్యం



**గురురేవ** పరో ధర్మో గురురేవ పరా గతిః
యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురౌ,
సబ్రహ్మావి త్పరం ప్రేయా దితి వేదానుశాసనమ్ (శాట్యాయనీయోపనిషత్)

'గురువే పరమ ధర్మం. గురువే పరాగతి... ఎవరికి దేవుడిపై, గురువుపై సమానమైన భక్తి ఉంటుందో అతను పరబ్రహ్మను పొందగలడు' అని పై శ్లోక భావం. దీనిని బలపరిచే కథ ఇది.

ధ్వజదత్తుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను దారిద్ర్యంతో బాధపడుతూ నైమిశారణ్యంలోని పుష్కర మహాముని దగ్గరికి వెళ్లి సాష్టాంగపడ్డాడు. ఆ బ్రాహ్మణుడికి ముని హనుమత్ మంత్రాన్ని ఉపదేశించాడు. ధ్వజదత్తుడు రాత్రింబవళ్లు ఆ మంత్రజపం చేశాడు. గురువుపై విశ్వాసం లేక మంత్రసిద్ధి కాలేదు. కొన్నాళ్లకు వ్యాధిపీడితుడైన గాలుడనే వేటగాడు ధ్వజదత్తుడిని కలుసుకున్నాడు. తన బాధలు ఆయనతో చెప్పుకొన్నాడు. అప్పుడు ధ్వజదత్తుడు 'దైవం లేదు. మంత్రం లేదు. పుష్కరుడి నుంచి మాత్రం మంత్రం స్వీకరించకు' అన్నాడు. గాలుడు ఉత్సుకతతో పుష్కర మహర్షి దగ్గరికి వెళ్లి పరిచర్య చేశాడు. అతనిపై సందేహంతో మహర్షి ధ్యానించగా హనుమంతుడు ప్రత్యక్షమయ్యాడు. 'గురుభక్తి ఉంటే సరి. ఉపదేశించవచ్చు' అని ఆజ్ఞ ఇచ్చాడు ఆంజనేయుడు.

మంత్రోపదేశానికి ముందు గాలుడిని పుణ్యతీర్థంలో స్నానం చేసి రమ్మన్నాడు పుష్కర ముని. అప్పుడు గాలుడు 'మీ పాద జలమే పుణ్యతీర్థం' అన్నాడు. గురువు హనుమంతుడిని ధ్యానించి తన పాదజలాన్ని అతనిపై చల్లి ద్వాదశాక్షర మంత్రోపదేశం చేశాడు. గురు సమీపంలోనే గాలుడు 108 సార్లు జపం చేయగానే సిద్ధి లభించింది. భూత భవిష్యత్తులను దర్శించగలిగాడు. గాలుడు ఇంటికి వెళుతూ ధ్వజదత్తుడిని చూశాడు. కానీ, అతను గురునింద చేస్తాడన్న భయంతో మరోదారి ఎంచుకున్నాడు. అది గమనించిన ధ్వజదత్తుడు గాలుడికి అడ్డువచ్చి, అతనిలో అపూర్వ తేజస్సు చూసి అబ్బురపడ్డాడు. వెంటనే పుష్కరుడి దగ్గరికి వెళ్లి 'గాలుడికి ఎలా సిద్ధి కలిగింది? నాకు ఎందుకు కాలేదు?' అని నిలదీశాడు. అప్పుడు పుష్కరుడు 'నీకు దైవంపైనే గాని గురువుపట్ల నమ్మకం లేనందుకు' అన్నాడు. ధ్వజదత్తుడు పశ్చాత్తాపంతో పుణ్య నదీ తీరానికి వెళ్లి గురువు, దైవంపై సమాన విశ్వాసాన్ని దృఢతరం చేసి 108 సార్లు జపం చేయగానే అతనికి సిద్ధి కలిగింది. ఆంజనేయుడు ఉష్ట్ర వాహనారూఢుడై సువర్చలా సమేతంగా దర్శనమిచ్చాడు. ధ్వజదత్తుడికి అపార సంపదలతోపాటు మోక్షాన్ని కూడా ప్రసాదించాడు.

... డా|| వెలుదండ సత్యనారాయణ

కథాసుధ

## ఇసుక రేణువు

**ఒక** పండితుడు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చేవాడు. ఆయన చక్కటి ఉపన్యాసకుడైనా గర్వం ఎక్కువ. తనకు అంతా తెలుసని, తనంత తెలివైనవాడు ఆ చుట్టుపక్కల ఎవ్వరూ లేరని నమ్మేవాడు. తక్కువగా చదువుకున్నవారు ఎవరైనా ఎదురైతే లోకువ చేసి మాట్లాడే వాడు. పండితుడి ప్రవర్తనకు వారి మనసు గాయపడినా ఆయనకు ఎదురు చెప్పే సాహసం ఎవరూ చేసేవారు కాదు. దాంతో ఆ పండితుడు మరింతగా రెచ్చిపోయేవాడు. ఓ రాత్రి దూరంగా ఉన్న ఒక గ్రామానికి తన శిష్యులతో ఉపన్యాసానికి వెళ్లాడు పండితుడు. అక్కడినుంచి వెనుదిరిగే సమయానికి బాగా చీకటిపడింది. తిరిగి వస్తుండగా దారిలో వారికి ఓ పొలంలో ఒక రైతు కనిపించాడు. చేతిలో దీపం పట్టుకుని పొలాలకు నీళ్లు పెడుతున్నాడు ఆ రైతు. పండితుడు అతణ్ని సమీపించే సమయానికి.. రైతు పొలానికి నీళ్లు సరిగ్గా పారుతున్నాయో లేదో గమనిస్తున్నాడు. పొలాల్లో మట్టిపని చేసే రైతు అంత జ్ఞానవంతుడు కాకపోవచ్చని భావించాడు పండితుడు. అక్కడ తన గొప్పతనాన్ని చాటుకోవాలని భావించాడు. రైతు చేతిలోని దీపాన్ని చూపుతూ 'ఈ కాంతి ఎక్కడినుంచి వచ్చింది?' అని అడిగాడు పండితుడు. ఇలాంటి పెద్ద ప్రశ్నలకు సామాన్య రైతు సమాధానం ఇవ్వలేడని భావించారు శిష్యులు. రైతు చిన్నగా నవ్వి తన చేతిలోని దీపాన్ని చప్పున ఆర్పేశాడు. పండితుడితో 'ఇంతసేపు ఉన్న కాంతి ఎక్కడికి వెళ్లిందో చెప్పండి, అప్పుడు నేను మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను' అన్నాడు. చిన్నబోయిన పండితుడి ముఖం చూసిన శిష్యులు 'కాంతి ఎక్కడినుంచి వస్తుందో, ఎక్కడికి వెళ్లిపోతుందో ఎవ్వరికీ తెలియదు కదా. సమాధానం తెలియని ప్రశ్నలు అడగటం వల్ల వచ్చిన సమస్య ఇది' అని అనుకున్నారు. 'నాకు చాలా తెలుసనుకున్నాను. కానీ, నాకు తెలిసింది సముద్రంలో చిన్న ఇసుక రేణువంత కూడా లేదు' అని తెలుసుకున్న పండితుడు చిన్నగా అక్కడినుంచి కదిలాడు.



... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

## జీవిత లక్ష్యం

**జీవితం** అమూల్యమైనది. ఎవ్వరికైనా ఒక్కసారే దొరుకుతుంది. ఆ జీవితాన్ని అందంగా మలుచుకోవాలి. అర్థవంతంగా గడపాలని చెబుతుంది ఖురాన్. ఒక్కసారి ప్రాణం పోయిందంటే ఈ జీవిత ప్రయాణం ముగిసినట్లే. అందుకే జీవితాన్ని వరంగా భావించాలి. మనిషికి లభించే ఆయుష్షు కేవలం పరీక్ష మాత్రమే! సుఖదుఃఖాలైనా, ఆకలిదప్పులైనా, కలిమిలేములైనా అన్నీ మానవుణ్ని పరీక్షించడానికే అని చెబుతుంది ఖురాన్. మనిషి బతికి ఉండగా తాను చేసుకున్న కర్మలకు పరలోకంలో అల్లాహ్‌కు జవాబు చెప్పుకోవాల్సి ఉంటుందని ముహమ్మద్ ప్రవక్త (సఅసం) పేర్కొన్నారు. ఇక్కడ మనిషి అనుభవించిన అనుగ్రహాల విషయంలో రేపు పరలోకంలో దైవం లెక్క తీసుకుంటాడని, కాబట్టి జవాబుదారీతనంతో జీవితాన్ని గడపాలని ప్రవక్త హెచ్చరించారు. 'మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారిని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది' (దివ్య ఖురాన్ 2: 21) అని ఖురాన్ స్పష్టం చేసింది. 'విశ్వాసులారా! రుకూ చేయండి, సజ్దా చెయ్యండి, మీ ప్రభువుకు దాస్యం చెయ్యండి, మంచిపనులు చెయ్యండి. దీని ద్వారానే మీకు సాఫల్య భాగ్యం లభిస్తుందని ఆశించవచ్చు' అని ఖురాన్ బోధ (22:77). పైన పేర్కొన్న ఖురాన్ బోధనలు మన జీవిత లక్ష్యాన్ని స్పష్టపరుస్తున్నాయి. మనిషి జీవితాంతం తన పుట్టుకను, మరణాన్ని ప్రసాదించే వాడిని ఆరాధించడమే మానవ జీవిత లక్ష్యమని ఖురాన్ విడమర్చి చెప్పింది. ఆరాధన అంటే కేవలం నమాజులు, ఉపవాసాలు, హజ్ యాత్ర వరకే పరిమితం కాదు. ఆరాధన అంటే జీవితంలోని అన్ని రంగాలలో దైవ ధర్మం ఉట్టిపడాలి. ఇంట్లో ఉన్నా, ఆఫీసులో ఉన్నా, బజారులో ఉన్నా, వ్యాపారంలో ఉన్నా, రాజకీయాల్లో ఉన్నా, మంత్రిగా ఉన్నా ఇలా అన్ని రంగాల్లో దేవుడి ధర్మాదేశాలను పాటించాలన్నదే అల్లాహ్ ఆదేశం. ప్రతీ క్షణం ఆ అల్లాహ్ మనల్ని కనిపెడుతూ ఉన్నాడనే భావన మనలో స్ఫురించాలి. మన హక్కులు, బాధ్యతలు సవ్యంగా నెరవేర్చాలి. మంచిని పెంచుతూ చెడును తుంచే పనికి పూనుకోవాలి. అల్లాహ్ ప్రసాదించిన ఈ అమూల్యమైన జీవితాన్ని దైవం ఆదేశాలకు అనుగుణంగా మలుచుకుంటే పరలోకంలో ఎప్పటికీ అంతంకాని శాశ్వతమైన స్వర్గవనాలకు అర్హత సాధించవచ్చు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

ఇస్లాం బోధ





**శుకయోగి పరీక్షిత్తుతో...**
**రాజా! యయాతి శాపం వలన యాదవ వీరులకు రాజపీఠం ఆమోద యోగ్యం కాదు. కాన, దామోదరుడు, సత్యావధానుడు- సత్యవ్రతుడు, దాన శీలుడు, మాననీయుడు- గౌరవార్హుడు, కానివాని (శత్రువు)కి భయంకరుడు, పుత్రుడైన కంసునిచే కారాగృహంలో బంధింపబడి, ఆపై వాని మృతి వలన అతి దీనుడై ఉన్న వృద్ధుడైన ఉగ్రసేనునితో ప్రేమ మీరగ ఇలా విన్నవించాడు.. తాతా! ఈ భూమికి నీవే అధిపతిగా ఉండు. నీ కనుసన్నలలో మేము నిన్ను సేవిస్తూ ఉంటాము. దేవతలే నీకు కప్పం చెల్లిస్తారు.**

# గిరిధరుని అరుదైన గురుదక్షిణ



మన పోతన మధురిమ 199వ భాగం

**ఇక** ఇతర రాజులు నరపతివైన నీకు తప్పక తలలు వంచుతారని వేరుగా చెప్పడమెందుకు? ఇట్లు పలికి, యాదవులకు ఏడుగడ– (తల్లి, తండ్రి, గురువు, దైవము, పురుషుడు, విద్య, దాత అనే ఏడు విధాల రక్షకుడు) అయిన మాయా మానుష విగ్రహుడు మాధవుడు ఉగ్రసేనుని వేడుకతో సముదగ్ర (విశాలమూ, శత్రు భయంకరమూ)మైన మధురా రాజ్యానికి రేడు (రాజు) గావించాడు. అటు పిమ్మట, కపట సంసారియైన కంసారి కృష్ణుడు, పూర్వం హింసకు మారుపేరైన కంసుని భయము కతన (వలన) ఇతర దేశాలలో వెతలు– అగచాట్లు (శ్రమలు) పడుతున్న తన జ్ఞాతులూ, చుట్టాలూ అయిన యాదవులు, వృష్ణులూ, భోజులు, మధువులు, దశార్హులు, కుకురులు, అంధకులు ఆదిగాగల వారినందరినీ మెప్పించి, ఆదరంతో మధురకు రప్పించాడు. వారి చిత్తాలు– మనసులు సంతసించే విధంగా వారికి విత్తాలు– ధనాదులు ఇప్పించి, నివాసానికి గృహాలు కల్పించాడు...

**క|| 'మధుసూదన సత్కరుణా**
**మధురాలోకన విముక్త మానస భయులై**
**మధుర వచనముల వారును**
**మధురా నగరంబు ప్రజలు మనిరి నరేంద్రా!'**

శుకుడు– రాజా! కరుణ రసంతో నిండిన మధుసూదనుని మృదు మధురాలైన కృపా కటాక్ష వీక్షణాలతో మనసులోని భీతి తొలగిపోగా, వారూ, మధురా నగర ప్రజలు పరస్పర ప్రీతి– అనురాగ పూర్వక సరస సంభాషణలతో కలసి మెలసి జీవింపసాగారు. అనంతరం, రామన్నతో కూడి వెన్నుడు గోవిందుడు, తమను కన్న బిడ్డల కంటె మిన్న (అధికం)గా పెంచి పోషించిన నందుని వస్త్ర, ఆభరణాలతో సత్కరించి, కౌగిలించుకొని మన్ననతో వ్రేపల్లెకు సాగనంపాడు. ఖిన్నుడైన నందుడు వాత్సల్యంతో విలవిల్లాడుతూ, కన్నీరు పెట్టుకొని గొల్లపెద్దలతో కలసి వెళ్లలేక– వెళ్లలేక కుళ్లుతూ– కుమిలిపోతూ వ్రేపల్లెకు వెళ్లిపోయాడు.

తరువాత చూడాకర్మ, చేలాది సంస్కారాలు పొంది రామకృష్ణులు గర్గాచార్యులచే '.. భర్గో దేవస్య ధీమహి..' అనే గాయత్రీ మంత్రాన్ని గ్రహించి, అనర్గళం (నిరాటంకం)గా జపించి, బ్రహ్మచర్య వ్రతం అనుష్ఠించారు. 'ఆచార్యవాన్ పురుషో వేద'– ఆదరంతో ఉత్తముడైన గురువును ఆదరువు– ఆశ్రయంగా కలిగి ఉన్నవాడే మాయా సంసారపు బరువును సులభంగా దించుకోగలడని లోకానికి బోధించాలని, అనాది గురు పరంపరను ఆదరించాలని ఖలవిదారి మురారి, తానే జగద్గురువైనప్పటికీ, అన్నతో కలసి ఆచార్యుని అన్వేషిస్తూ అవంతీ (ఉజ్జయిని) పురాన్ని చేరుకున్నాడు. అన్ని విద్యలకు పేరెన్నికగన్న ఏకైక ఖని– గని వంటివారూ, సర్వజ్ఞులూ అయిన రామకృష్ణులిరువురూ అచ్చట నివసిస్తున్న సాందీపనిని ఆచార్యునిగా ఎంచుకొని, భక్తి శ్రద్ధలతో సేవించి, అరవై నాలుగు దినాలలో అరవై నాలుగు విద్య– కళలను వినికిడి చేతనే (ఏకసంథాగ్రాహులై) నేర్చుకున్నారు. గురుకులంలో అధ్యయనం ముగిసింది. సాందీపనిని గురుదక్షిణ కోరమన్నారు. శిష్యుల మాహాత్మ్యాన్ని, ప్రభావాన్ని గుర్తించి ఆశ్చర్యపడ్డ సాందీపని, 'ఇంచుకంత– అల్పమైన దానిని కోరితే నేను వంచితున్నవుతాను. ఇప్పుడు మించుకు పోయిందేమున్నది గనక!' అని మదిలో ఎంచి, తన హృదయేశ్వరి– ఇల్లాలిని సంప్రదించి రామకృష్ణులతో–


**శా|| 'అంభోరాశి బ్రభాస తీర్థమున మున్నస్మత్తనూ సంభవుం**
**డంభోగాహము సేయుచున్ మునిగి లేడయ్యెం గృపాంభోనిధుల్**
**శుంభద్వీర్యులు మీరు మీ గురునికిం జోద్యంబుగా శిష్యతన్**
**గాంభీర్యంబున బుత్రదక్షిణ యిడం గర్తవ్య మూహింపరే!'**–

నాయనలారా! మా పుత్రుడు మునుపు సముద్రంలో ప్రభాసమనే ఘట్టంలో స్నానం చేస్తూ నీటిలో మునిగి కనిపించకుండా పోయాడు. దయాసముద్రులు, పౌరుష ప్రతాపాలలో అపర రుద్రమూర్తులు అయిన మీరు మాకు అంతేవాసులు– శిష్యులు అయ్యారు. అయ్యలారా! మా భాగ్యమెంతటిదో! కనుక, అందరికి అచ్చెరువు కలుగునట్లు గురువుకు దక్షిణగా మా కొమరుని తెచ్చి ఇవ్వండి. ఇది మీ బాధ్యతగా గుర్తించండి. వెళ్లండి' అని ఆదేశించాడు.

శుకుడు– రాజా! రామకృష్ణులు వెంటనే సాగర సమీపానికి వచ్చి మా గురు పుత్రుని మాకు అప్పగించమని గర్జించారు. అతనిని పంచజనుడనే కంబు (శంఖ) రూపం ధరించిన దైత్యుడు మింగాడని సాగరుడు తెలుపగా...

**శా|| 'శంఖారావము తోడ బంచజనుడున్ శంకించి చిత్తంబులో**
**సంఖిన్నుండుగ వార్ధి జొచ్చి దహన జ్వాలాభ హేమోజ్జ్వల**
**త్పుంఖాస్త్రంబున గూల్చి వాని జఠరంబున్ వ్రచ్చి గోవిందు డ**
**ప్రేంఖచ్చిత్తుడు బాలు గానక గురు ప్రేమోదితోద్యోగుడై'**

అంబుజాక్షుడు శంఖం పూరించాడు. ఆ కంబు ధ్వని విని పంచజనుడు భయ సందేహాలతో కంపించి పోయాడు. అచ్యుతుడు అంబుధి– సాగరంలో ప్రవేశించి, అగ్ని జ్వాలలతో సమానములై, బంగారు పింజలతో రంగారు అంబకా– బాణాలతో పంచజనుని పడగూల్చి, వాని కడుపు చీల్చి చూడగా గురుపుత్రుని జాడ పొడగట్ట– అగుపడ లేదు. శుకుడు– రాజా! దానవ విరోధియైన ఆ దామోదరుడు ఆ పంచజనుని దేహంలో జనించిన 'పాంచజన్య' మనే మానిత– గొప్ప శంఖాన్ని గ్రహించాడు. ప్రోడ– సర్వజ్ఞుడైన పరమాత్మకు బాలుని జాడ తెలిసినా లీలాలోలుడు తెలియనట్లు వెదకుతున్నాడు. కాలకాలుడు– బాలకృష్ణుడు సంకర్షణ (బలరామ) సహితుడై రథాన్ని అధిరోహించి యమ సదనానికి వెళ్లాడు. 'సంయమనీ' నగర ద్వారం వద్ద ప్రళయకాల మేఘపురీతి (వలె)



గంభీర ధ్వనితో భీతి గొలిపే పాంచజన్య శంఖాన్ని పూరించాడు. ఆ శంఖఘోష విని, 'కరకైన నా భుజాదండాన్ని సరకు గొనక– లెక్కచేయక కండకావరంతో ఎవడో దుండగీడు (ఆకతాయి) శంఖం ఊదుతున్నాడు ఎవరి అండతోనో! వాడు ప్రచండమైన నా క్రోధాగ్నికి భస్మమైపోతాడు' అంటూ దండధరుడు మెండైన రోషంతో మండిపడుతూ వచ్చాడు. రామకృష్ణులను చూచి లీలామానవులైన విష్ణుమూర్తులుగా గ్రహించి, భక్తితో నుతించి, నతులు (వందనాలు) సమర్పించి 'నేనేమి చెయ్యాలో ఆనతి ఇమ్మ'ని అర్థించాడు.

అధోక్షజుడు ఇలా అన్నాడు.. పుణ్యశీలుడవైన ఓ సరణ్యూ (యమధర్మరాజా)! చెపుతా విను. మా గురు పుత్రునిలో తప్పు ఉండబట్టి అతని కర్మానుసారంగా దండించడానికి తెప్పించుకున్నావు. అతణ్ని ఇప్పుడు ఖండితంగా మాకు అప్పగించు, మాకతడు కావాలి. ధర్మరాజా! కర్మ నిబంధనను అలా ఉంచు. ఆ కర్మమర్మం ('గహనా కర్మణో గతిః'– గీత) నీవెరుగవు. నా ఆనతి– ఆజ్ఞ కర్మను మించింది. నా ముందు కర్మ ఎందుకూ కొరగానిది! శుకుడు– రాజా! ఈశ్వరుడు 'కర్తుమకర్తు మన్యథా కర్తుం' (ఒక విధంగా చేయడానికి, అలా చేయకుండా ఉండటానికి, కాక మరో విధంగా చేయడానికి) సమర్థుడు. అలా కాని ఎడల ఆయన 'ఐశ్వర్యం' ఏపాటిది? భగవంతుడు ఏమి చేసినా జీవుల కర్మననుసరించే చేస్తాడన్నది కర్మఠుల– కర్మిష్ఠుల భావన. ఇది అభక్తుల– భక్తులు కాని వారిపట్ల మాత్రమే చెల్లుబాటవుతుంది. కాని, భక్తుల విషయం అలా కాదు. భగవంతుడు భక్తులయందు భక్తి కలవాడని భాగవతం ఉద్ఘోషిస్తోంది. 'సమోహం సర్వభూతేషు' (గీత)– సర్వుల ఎడల సముడైన పరమాత్మయందు భక్తులు పక్షపాతాన్ని పుట్టిస్తారు. ఏదో ఒక వ్యాజం– నెపం పెట్టుకొని అవ్యాజ కరుణామూర్తి కృష్ణుడు తన ఏకాంత– అనన్య భక్తులను ఉద్ధరిస్తాడు. ఇది ఆయనకు నైజం– స్వభావం. ఇదీ భాగవత దర్శన రహస్యం!

శుకుడు– రాజా! అనంతుని మాటలు విని అంతకుడు 'ఇడిగో వీడె, తీసుకుపొండి' అని చెంతకు రప్పించి గురు కుమారుని భక్తితో ఇచ్చివేశాడు. పన్నగ (కాళియ) మర్దనుడు, దుర్జన దమనుని– పాపులను అణచేవానిని, మహిష గమనుని– దున్నపై స్వారీ చేసేవాడు అయిన శమనుని– యముని వీడ్కొని, గురు కుమారుని తోడ్కొని వచ్చి, సాందీపనికిచ్చి, 'ఇంకా మీకు నచ్చిన ఏ పని చేసి చూపాలో చెప్పండి' అని అన్నారు. సాందీపని ఎంతగానో మెచ్చి వారితో ఇలా ముచ్చటించాడు.

**క|| 'గురునకు గోరిన దక్షిణ**
**గరుణన్ మున్నెవ్వడిచ్చె? ఘనులార! భవ**
**ద్గురునకు గోరిన దక్షిణ**
**దిరముగ నిచ్చితిరి మీరు దీపితయశులై'...**

ధీరవరులారా! వీర కుమారులారా! గురువు కోరిన బరువైన కోరికను కరుణతో చిరు కానుకగా భావించి తెచ్చి ఇచ్చారు. లోకాలు అచ్చెరువొందే అరుదైన ఇలాంటి దక్షిణను గురువుకు సమర్పించిన వారు ఇంతవరకు ఒరులు– ఇతరులు ఎవరైనా ఉన్నారా? మీ కీర్తిని దిగంతాలకు ప్రకాశింపజేశారు.

**క|| 'కాలుని వీటికి జని మృత**
**బాలకు దేనొరుల వశమె? భవదీయ కృపన్**
**మేలు దొరకొనియె మాకు, వి**
**శాల మగుంగాత మీ యశము లోకములన్'**

'లోకపాలకులారా! కదన కుతూహలంతో కాలుని సదనానికి వెళ్లి ఈ విధంగా మృత బాలుని తెచ్చి ఇవ్వడం ఇతరులకు సాధ్యం కాదు కదా! జగాలనేలు కృపా విశాలురు మీరు. అపారమైన భక్తితో మాకు మేలు కలిగించారు. చాలు చాలు! మా ముద్దు మురిపాలన్నీ తీర్చారు. ఇక మాకు ఏ వరాలూ వద్దు. కల్యాణమూర్తులారా! మీ కీర్తి రాకాసుధాకర దీప్తి– నిండు పున్నమి పండు వెన్నెల వలె లోకాలలో సదా మెండుగా వ్యాప్తి చెందుగాక! నేను ధన్యుడనయ్యాను' అంటూ సాందీపని వారిని దీవించాడు. శుకుడు– రాజా! గురువు వద్ద సెలవు పుచ్చుకొని కృతార్థులై రామకృష్ణులు రథారూఢులై తమ నెలవుకు– మధురాపురికి వచ్చి శంఖం పూరించారు. తాము పోగొట్టుకొన్న ధనాన్ని తిరిగి పొందినట్లుగ పుర ప్రజలు ఆనందంగా విందులు చేసుకున్నారు.

(సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

## చేసిందంతా ఆయనే!

**మహాభారతంలో** మహామహాయోధులందరూ ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొన్నవారే. కాని, ఒక్క కృష్ణభగవానుడు మాత్రం ఎలాంటి ఆయుధమూ పట్టలేదు. ఎదురుపడి పోరాటమూ చేయలేదు. కేవలం రథసారథిగానే ఉన్నట్లు కనిపించాడు. మహాసంగ్రామాన్ని ఓ సాక్షిలా గమనించాడు. కాని, ఆ రణరంగమంతా ఆ రుక్మిణీనాథుడి కనుసన్నల్లోనే ముందుకు సాగిందన్నది జగద్విదితం. అకర్మలో తీవ్ర కర్మ దాగి ఉంటుందనటానికి అంతకుమించి తార్కాణం లేదు. ఇదే విషయాన్ని బర్బరీకుడి వృత్తాంతం తెలియజేస్తుంది. కురుక్షేత్ర సంగ్రామ సమయంలో దేశంలోని రాజులందరూ కౌరవ, పాండవ పక్షాలలో చేరారు. యోధానుయోధుడైన బర్బరీకుడు కూడా కురుక్షేత్రం చేరుకుంటాడు. ఏ పక్షం బలహీనంగా ఉంటే అందులో చేరుతాను అంటాడు బర్బరీకుడు. యుద్ధంలో బలాబలాలు మారుతూ ఉంటాయి. బర్బరీకుడు ఎవరి పక్షం వహించినా యుద్ధం ఫలితం తేలదు. కాబట్టి, శ్రీకృష్ణుడు బర్బరీకుడి తలను ఇవ్వమని కోరుతాడు. అయితే మొండెం నుంచి వేరైన తన తల కురుక్షేత్ర యుద్ధాన్ని చూసేలా వరం కోరుతాడు బర్బరీకుడు. శ్రీకృష్ణుడు సరేనంటాడు. అలా బర్బరీకుడి శిరస్సు కురుపాండవ సంగ్రామం అంతా వీక్షిస్తుంది. యుద్ధం పూర్తయిన తర్వాత శ్రీకృష్ణుడు బర్బరీకుడి శిరస్సుతో 'యుద్ధం చూశావా?' అని అడుగుతాడు. అప్పుడు బర్బరీకుడు 'దేవా! యుద్ధం జరిగినన్ని రోజులూ కురుక్షేత్రంపై గిరగిర తిరిగిన నీ సుదర్శన చక్రం తప్ప నాకు మరేమీ కనిపించలేదు' అంటాడు. ఏం చేయకున్నా.. అంతా శ్రీకృష్ణుడే చేశాడు అనడానికి నిదర్శనమిది.

## చివురించిన చేతికర్ర

క్రీస్తు సందేశం



**పూర్వకాలంలో** దేవుడు ప్రజలతో మాట్లాడేవాడట. అలా మాట్లాడేది కేవలం తన స్వరంతోనే గాక, చేష్టలతో కూడా! ఆయా సంఘటనల్లో తనవైన నిర్ణయాలను, ఆదేశాలను తెలియజేసేవాడట. అలాగే బైబిల్ పూర్వ నిబంధనలో ఆరోను పెద్దరికాన్నీ, అర్చకాధిపత్యాన్నీ నిర్ణయించడానికి ఓ సంఘటన జరిగింది. అదే 'బాగా ఏండిపోయిన చేతికర్ర మళ్లీ చిగురించడం'. దానిని దైవ నిర్ణయంగా భావించి అక్కడివారంతా ఆ చేతికర్ర గలవాణ్ని పూజాధికారిగా అంగీకరించడం విశేషం. క్రీస్తుకు ముందు 1500 సంవత్సరాల కిందట జరిగిన కథ ఇది. ఆరోను ఎవరో కాదు, ప్రజల్ని ఈజిప్టు చెరలోంచి బంధవిముక్తుల్ని చేసి విడిపించి తెచ్చిన మహానాయకుడు మోషే సోదరుడు. అతనికి ఒక అక్క కూడా ఉంది. ఆమె పేరు మిరియాం. ఆరోను ఇశ్రాయేలీయ పన్నెండు గోత్రాల్లో ఒక గోత్రానికి పెద్ద. ప్రజలను ఆధ్యాత్మికంగా నడిపించడంలో మోషేకు సహకరించిన వ్యక్తి.

ఆరోనుకు మరో పేరు అహరోను. కాంతిదాయకుడు అని, కొండంత బలవంతుడు అని ఆ పేరుకు అర్థం. ఆరోను పూజారి నియమాలకు సంబంధించిన వాడు, నిష్ఠాగరిష్ఠుడు. అయితే తన పూజారి పదవిని నిర్ధారించేది దేవుడే! ప్రజల్లో అప్పటికే ఈ అన్నదమ్ముల (మోషే, ఆరోను) నాయకత్వంపై గొణుగుడు ప్రారంభమైంది. ఇద్దరి మధ్యా పోటీ చాపకింద నీరులా ప్రవహించింది. ఆ నేపథ్యంలో పన్నెండు గోత్రాల వారూ తమ తమ చేతికర్రలు మందిరంలో ఉంచాలి. దేవుడు ఏ గోత్రపు నాయకత్వాన్ని ఆశీర్వదిస్తాడో ఆ వ్యక్తి చేతికర్ర చిగురులెత్తి పుష్పించాలి. అలా చిగురించిన చేతికర్ర గలవాడిని అందరూ పూజాధికారిగా అంగీకరిస్తారు. దేవుడి ఆశీర్వాదంతో ఆరోను చేతికర్ర చివురించింది, పుష్పించింది, ఫలించింది కూడా! మహోత్సవంతో ప్రజలంతా ఆరోనును దైవార్చకుడిగా గౌరవించారు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024